సాక్షి
హనుమకొండ

7

ఆదివారం । 2 । మార్చి । 2025



న్యూస్‌రీల్

ముగిసిన బ్రహ్మోత్సవాలు



హన్మకొండ కల్చరల్ : వేయిస్తంభాల దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యాన వేదపండితులు స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం అనంతరం పుష్పార్చన చేశారు. క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి పంచామృతాలు, నారికేళాభిషేకం, చందన, ఆకు పూజ, నూతన వస్త్రాలంకరణ నిర్వహించారు. గణపతి నవగ్రహ రుద్రహోమంతో మహాపూర్ణాహుతి చేశారు. దాతలు మాడిశెట్టి సాంబయ్య, శ్రీదేవి దంపతులు, వాసుదేవరెడ్డి, సునీత, పైరెడ్డి కృష్ణ సావంత్, సరోజ, అనిల్ కేడియా పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్



హన్మకొండ చౌరస్తా: మామునూరు విమానాశ్రయ ఏర్పాటుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి.. వరంగల్ ప్రజలు, ప్రజాప్రతినిధుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. వరంగల్ ప్రజల ఆకాంక్షను నెరవేర్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య, పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, మురళీనాయక్, పీసీసీ నాయకుడు సాంబయ్య ఉన్నారు.

సర్వే ల్యాండ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట: తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీలో కన్‌స్ట్రక్షన్ ఎలక్ట్రికల్ ట్రెనింగ్, ల్యాండ్ సర్వే శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా డైరెక్టర్ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 నుంచి 45 ఏళ్ల వయసు వారు ఫీజు చెల్లించి శిక్షణ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు వెంటనే సర్టిఫికెట్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూర్తి వివరాలకు 99636-11239, 99496 84763 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

30 మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో దూరవిద్య కేంద్రం పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం నిర్వహించిన ఆయా పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల్లో గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎగ్జామ్ సెంటర్‌లో 25 మంది, బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఐదుగురు మొత్తం.. 30 మంది కాపీయింగ్ చేస్తూ స్క్వాడ్‌కు పట్టుబడి డీబార్ అయినట్లు అదనపు పరీక్షల నియంత్రణాధికారి పద్మజ తెలిపారు.

రాష్ట్ర స్థాయికి జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టులు ఎంపిక

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, హిస్టరీ, జువాలజీ, తెలుగు విభాగాల సబ్జెక్టుల నుంచి జిజ్ఞాస స్టూడెంట్స్ స్టడీ ప్రాజెక్టులు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ బి.చంద్రమౌళి శనివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయా విభాగాల అధ్యాపకులు పి.రాజిరెడ్డి, అరుణ, పి.ప్రతిభ, సామ్యూల్ ప్రవీణ్‌కుమార్, పి.పద్మ, జి.సుహాసిని, రామరత్నమాలను ఆయన ఈసందర్భంగా అభినందించారు. అదేవిధంగా జిజ్ఞాస పరిశోధక విద్యార్థులను కూడా వారు అభినందించారు.

పడిపోతున్న భూగర్భ జలం

- గత నెలలో నగటు 5.93 మీటర్లు
- ప్రస్తుతం 6.30 మీటర్లు దిగువన నీరు

హన్మకొండ: హనుమకొండ జిల్లాలో భూగర్భ జలాలు రోజురోజుకూ పడిపోతున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో పెరిగిన భూగర్భ జలాలు నవంబర్ నుంచి క్రమేపీ తగ్గుతున్నాయి. సెప్టెంబర్ చివరన 2.94 మీటర్ల లోతులో ఉండగా నవంబర్ 4.16, డిసెంబర్ 4.81, జనవరి 5.93, ఫిబ్రవరి చివరన 6.30 మీటర్ల దిగువకు పడిపోయాయి. అక్టోబర్ తర్వాత వర్షాలు లేవు. నవంబర్ నుంచి యాసంగి వ్యవసాయ పనులు మొదలయ్యాయి. జిల్లాలో అన్ని పంటలు కలిపి 1,77,437 ఎకరాల్లో సాగు చేయగా.. ఇందులో వరి 1,19,270 ఎకరాలు, మొక్కజొన్న 57,498, వేరుశనగ 473, పొగాకు 62, కంది 35, మినుము 24, మిగతా పంటలు సింగిల్ డిజిట్‌లో సాగయ్యాయి. ప్రధానంగా వరి, మొక్కజొన్న సాగుకు నీటి వినియోగం పెరిగింది. దీనికితోడు జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టులు లేవు. దీంతో భూగర్భ జలమట్టం పడిపోతున్నది. గత ఏడాది ఫిబ్రవరి చివరన జిల్లా సగటు భూగర్భ జలమట్టం 6.17 మీటర్లు ఉండగా ఈ ఏడాది ఫిబ్రవరిలో 6.30 మీటర్లకు పడిపోయింది. అత్యధికంగా ఐనవోలులో 21.76 మీటర్లకు, నడికూడ మండలం చర్లపల్లిలో 12.50 మీటర్లకు పడిపోయింది.

మండలాల వారీగా..

భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్‌లో 5.51 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. జగన్నాథపూర్ 9.54, కొత్తపల్లి 8.56, వంగర 9.45, ధర్మసాగర్ మండలం ధర్మాపూర్ 3.53, ధర్మసాగర్ 2.89, పెద్ద పెండ్యాల 8.43, నారాయణగిరి 3.53, ఎల్కతుర్తి 7.51, హనుమకొండ 6.04, హసన్‌పర్తి మండలం నాగారం 7.89, సీతంపేట 3.42, ఎల్లాపూర్ 2.94, ఐనవోలు మండలం పున్నేలు 3.86, పంథిని 4.69, ఐనవోలు 21.76, కమలాపూర్ మండలం శనిగరం 6.11, వేలేరు మండలం పీచర 9.42, వేలేరు 2.76, ఆత్మకూరు 2.76, దామెర 3.49, నడికూడ మండలం చర్లపల్లి 12.42, నడికూడ 2.84, పరకాల 3.48, శాయంపేట మండలం పత్తిపాకలో 4.78 మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నాయి.


సింగర్ గీతామాధురి పాటకు కేరింతలు కొడుతున్న విద్యార్థులు


రంగులద్దుతున్న విద్యార్థులు

నిట్ వరంగల్‌లో నిర్వహిస్తున్న 'స్ప్రింగ్‌స్ప్రీ-25' వేడుకలు రెండోరోజు శనివారం కలర్‌ఫుల్‌గా సాగాయి. దేశవ్యాప్త వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు తమ సంస్కృతీ సంప్రదాయాల ప్రదర్శనలతో పోటీ పడ్డారు. గీతామాధురి, మ్యాడ్-2 రాకతో ప్రోషో అదిరిపోయింది. కొరియో నైట్‌లో విద్యార్థులు స్టెప్పులతో సందడి చేశారు. ఈ వేడుకలు ఆదివారం ముగియనున్నాయి. - కాజీపేట అర్బన్

- వివరాలు 8లో ▶

పూడిక పెద్దల కూడిక

భద్రకాళి చెరువు పనులపై బడా నాయకుల కన్ను?



- పట్టుబట్టి రేట్లు తగ్గించినట్లు ప్రచారం
- అనుకూల కాంట్రాక్టర్‌కు కట్టబెట్టే యత్నం
- అందుకే.. టెండర్ల దశలోనే బాలారిష్టాలు
- మరోసారి 5వ తేదీ వరకు టెండర్ల తేదీ పొడిగింపు

సాక్షిప్రతినిధి, వరంగల్:

భద్రకాళి చెరువులో పూడికతీత, మట్టి తరలింపు పనులకు మహూర్తం కుదరడం లేదు. యాభై ఏళ్ల తర్వాత పూడిక తీసేందుకు సుమారు మూడున్నర నెలల క్రితం చెరువు నుంచి నీళ్లు ఖాళీ చేశారు. వెంటనే టెండర్ ద్వారా చెరువు నుంచి పూడిక మట్టి తవ్వకం, లోడింగ్, తరలింపు పనులు చేపట్టేందుకు నిర్ణయం జరిగింది. ఈమేరకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో సమీక్ష కూడా నిర్వహించారు. నీటి పారుదల శాఖ ద్వారా మొత్తం రూ.13,00,09,046 వ్యయంతో రెండు పనులకు రెండు నెలల వ్యవధిలో రెండు పర్యాయాలు టెండర్లు పిలిచినా పనులు ఖరారు కాలేదు. అయితే ఇతర కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం వెనుక అసలు మతలబు.. కొందరు ప్రజాప్రతినిధులు తమ అనుచరులు, అనుకూలురైన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించే క్రమంలో ప్రయత్నాలు చేస్తుండడమేనన్న ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలో మొదట మట్టి తవ్వకం, తరలింపు పనులకు క్యూబిక్ మీటర్ ధర రూ.162.56 ప్రకటించిన అధికారులు.. సవరణ, సాంకేతిక కారణాల పేరిట క్యూబిక్ మీటరుకు రూ.71.83లుగా ఖరారు చేశారన్న చర్చ జరుగుతోంది.

రేట్ల తగ్గింపుపై అనుమానాలు..

భద్రకాళి చెరువు పూడిక పనుల ఖరారులో ఆలస్యం కావడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే రెండుసార్లు టెండర్లు పిలిచినా అధికారులు.. మొదట ఇద్దరు టెండర్లు వేస్తే తక్కువ కోట్ చేశారని రద్దు చేశారు. ఆతర్వాత క్యూబిక్ మీటర్‌కు రూ.162.56 ఉన్న రేటును రూ.71.83లు తగ్గించి.. నాన్ యూజ్ ఫుల్ సాయిల్‌గా గుర్తించి జీఎస్టీ, మెటీరియల్ కాస్ట్ తొలగిస్తున్నట్లు ప్రకటించారు. కాంట్రాక్టర్లు తక్కువ కోట్ చేశారని మొదట టెండర్లు రద్దు చేసిన అధికారులు.. క్యూబిక్ మీటర్‌కు రూ.90.73 (సగానికి పైగా) తగ్గించడం పథకం ప్రకారమేనన్న చర్చ జరుగుతోంది. ఓ వైపు కొందరు ప్రజాప్రతినిధులు ఈ పనులపై కన్నేసి అనుకూలురకు ఇప్పించే ప్రయత్నంలో భాగంగానే ఇదంతా జరుగుతోందనే ప్రచారం ఉండగా.. మరోవైపు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారి బంధువుకు కావాలని పట్టుపడుతున్నట్లు చెప్పుకుంటున్నారు. ఇదిలా ఉండగా.. వేసవి ఎండలు ముదురుతున్న నేపథ్యంలో.. ఖాళీ అయిన భద్రకాళి చెరువు కారణంగా నగరంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు హైదరాబాద్ నుంచి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను అప్రమత్తం చేస్తుండగా.. కలెక్టర్లు సైతం ఇరిగేషన్ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే పనుల చేజిక్కించుకునేందుకు కొందరు ప్రజాప్రతినిధుల ప్రయత్నాలు, ఒత్తిళ్ల కారణంగా టెండర్ల ఖరారులో ఆలస్యం జరుగుతోందన్న ప్రచారం బాగా జరుగుతోంది.

వాయిదాల టెండర్లు..

భద్రకాళి చెరువులో పూడికతీత, మట్టి తరలింపు పనులకు జనవరి 5, 10 తేదీల్లో టెండర్లు పిలిచారు. పూడిక తవ్వడం, లోడింగ్ పనులకు రూ.3,49,11,446 కేటాయించారు. అలాగే పూడిక మట్టిని తరలించేందుకు క్యూబిక్ మీటరుకు రూ.162.56 చొప్పున 5.85 లక్షల క్యూబిక్ మీటర్లకు రూ.9,50,97,600 చెల్లించేలా.. మరో టెండర్ పిలిచారు. ఈపనుల కోసం కాంట్రాక్టర్లు వ్యూహాత్మకంగానే ముందుకు రాలేదన్న చర్చ జరుగుతోంది. ఈసమయంలో మట్టి తవ్వకం, లోడింగ్ పని కంటే.. పూడిక మట్టి తరలించే పనికి సంబంధించిన టెండర్ నోటిఫికేషన్‌లో నిబంధనలు కఠినంగా ఉన్నాయని కాంట్రాక్టర్లు ఆసక్తి చూపట్లేదని అధికారులు చెప్పుకొచ్చారు. పూడికతీత, లోడింగ్, తరలింపు పనులను అత్యవసరంగా భావించిన అధికారులు రెండోసారి టెండర్లు పిలిచినా ఫలితం లేదు. ఇదే సమయంలో ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఫిబ్రవరి 28న టెండర్ల దాఖలుకు చివరి తేదీగా మరోసారి టెండర్లు పిలిచారు. తాజాగా మార్చి 5 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించారు.

సెలవుల వల్ల గడువు పొడిగింపు..

పూడికతీతలో వచ్చే నల్లమట్టి కొనుగోలుకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఈనెల 5 వరకు పొడిగించాం. మొదట ఫిబ్రవరి 17 నుంచి 28 వరకు సమయం ఇచ్చాం. అయితే వరుస సెలవులు రావడంతో డీడీలు తీసుకునే చివరి తేదీని ఫిబ్రవరి 28 నుంచి ఈనెల 5 వరకు పొడిగించాం. మట్టి కావాల్సిన వ్యక్తులు 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

- ఎం.శంకర్, ఈఈ, నీటిపారుదలశాఖ నక్కలగుట్ట డివిజన్

ఉద్యోగుల సమస్యలకు త్వరలో పరిష్కారం


రాష్ట్ర నాయకులను సన్మానిస్తున్న జిల్లా నాయకులు

హన్మకొండ అర్బన్: ఉద్యోగుల సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చినట్లు టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ తెలిపారు. హైదరాబాద్ నాంపల్లి టీఎన్జీఓస్ భవన్‌లో శనివారం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కేంద్ర సంఘం నేతలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ.. సీఎం దృష్టికి ఉద్యోగుల సమస్యలు తీసుకెళ్లినట్లు తెలిపారు. త్వరలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారని, సీఎంపై పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఆకుల రాజేందర్ నాయకత్వంలో హనుమకొండ జిల్లా యూనియన్ బలోపేతానికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. కేంద్ర సంఘం సహకారంతో జిల్లా స్థాయి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్‌లను ఘనంగా సన్మానించారు. జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి ఫనికెల రాజేశ్, గౌరవ అధ్యక్షులు శ్యాంసుందర్, రామునాయక్, రాజీవ్ ఇతర నాయకులు ఉన్నారు.

భూతగాదాల్లో తలదూర్చొద్దు..

పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా


మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్‌ఝా

వరంగల్ క్రైం: భూతగాదాల్లో తలదూర్చొదని పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా పోలీసులకు సూచించారు. నెలవారీ సమీక్షలో భాగంగా శనివారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న చైన్ స్నాచింగ్ కేసులను త్వరగా పరిష్కరించి నేరస్తులను పట్టుకోవాలని చెప్పారు. బెయిల్‌పై బయటకు వచ్చి వాయిదాలకు రాని నేరస్తులను కనిపెట్టి వారిని కోర్టులో హాజరు పర్చాలన్నారు. నిందితుల అరెస్టులో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. రాత్రి వేళల్లో నిరంతరం పెట్రోలింగ్ చేపట్టాలని ఆదేశించారు. టెన్త్, ఇంటర్ పరీక్షల దృష్ట్యా విద్యార్థులు సరైన సమయంలో సెంటర్లకు చేరేలా ట్రాఫిక్ సమస్యలు రాకుండా చూడాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ల వారీగా సమీక్షించిన సీపీ.. ఆస్తి, పోక్సో, మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాద కేసుల స్థితిగతులపై తెలుసుకున్నారు. డీసీపీ షేక్ సలీమా, రవీందర్, రాజమహేందర్‌నాయక్, ఏఎస్పీ చైతన్, మనన్‌భట్‌తో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై జాగ్రత్త అవసరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ
- ఉచిత వైద్య శిబిరం ప్రారంభం


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ

వరంగల్ లీగల్: క్యాన్సర్‌పై జాగ్రత్త అవసరమని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ సూచించారు. వరంగల్ కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రతిమ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వరంగల్ సహకారంతో అవగాహన, వ్యాధి స్క్రీనింగ్ టెస్టులను నిర్వహించారు. ముఖ్య అతిథిగా నిర్మలా గీతాంబ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. మంచి ఆహారపు అలవాట్లు, నిత్యం వాకింగ్, మద్యపానం, పొగాకుకు దూరంగా ఉంటే క్యాన్సర్‌ను జయించవచ్చని సూచించారు. అనంతరం వైద్యులు న్యాయవాదులకు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు మనీష శ్రావణ్ ఉన్నమ్, న్యాయ సేవాధికార సంస్థల కార్యదర్శులు సాయికుమార్, క్షమాదేశ్‌పాండే, జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, మాతంగి రమేశ్ బాబు, ప్రతిమ హాస్పిటల్ డాక్టర్ సుమిత్ర తిప్పాని, చౌకత్, ఉద్యోగులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళా న్యాయమూర్తులకు క్రీడా పోటీలు


చెస్ ఆడుతున్న మహిళా న్యాయమూర్తులు

ఈనెల 8న జరిగే మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో శనివారం మహిళా న్యాయమూర్తులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ తోపాటు న్యాయమూర్తులు మనీష శ్రావణ్ ఉన్నమ్, క్షమా దేశ్‌పాండే, శ్రావణ స్వాతి ఉల్లాసంగా పాల్గొని చెస్, షటిల్ ఆడారు.

మామునూరు ఎయిర్‌పోర్ట్ వద్ద ఉద్రిక్తత


మామునూరు ఎయిర్‌పోర్ట్ వద్ద తోపులాడుకుంటున్న బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు

- పోటాపోటీగా ప్రధాని మోదీ, రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకాలు
- బీజేపీ, కాంగ్రెస్ శ్రేణుల మధ్యతోపులాట

ఖిలా వరంగల్: మామునూరు విమానాశ్రయం పునరుద్ధరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం.. రాష్ట్ర ప్రభుత్వం 253 ఎకరాల భూ సేకరణకు రూ.205 కోట్ల నిధులు విడుదల చేసిన నేపథ్యంలో శనివారం ఎయిర్‌పోర్ట్ వద్దకు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చేరుకున్నారు. బీజేపీ శ్రేణులు పీఎం మోదీ ఫ్లెక్సీకి, కాంగ్రెస్ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఒకరి వేదికపైకి ఒకరు చొచ్చుకురావడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి తమ వల్లే అని ఇరు పార్టీల నేతలు పరస్పరం దూషణలతో తోపులాడుకున్నారు. పోలీసులు చేరుకుని ఇరువర్గాలను పంపించి ఎయిర్‌పోర్ట్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆర్‌ఆర్‌ఆర్ సదస్సుకు మేయర్, కమిషనర్

వరంగల్ అర్బన్: 'చెత్త రెడ్యూస్, రీ యూజ్, రీసైక్లింగ్(ఆర్‌ఆర్‌ఆర్) సిటీస్-2.0'పై రాజస్థాన్ రాజధాని పింక్ సిటీ జైపూర్‌లో ఈనెల 2 నుంచి 12వ రీజినల్ సదస్సు జరగనుంది. ఈ మేరకు వరంగల్ నగర మేయర్ మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, సీఎంహెచ్‌ఓ రాజారెడ్డికి ఆహ్వానం అందింది. జీడబ్ల్యూఎంసీ పరిధి 66 డివిజన్ల వ్యాప్తంగా అమలవుతున్న వివిధ అభివృద్ధి పనులు, చెత్త శుద్ధీకరణ, స్వచ్ఛ వరంగల్ కార్యక్రమాలపై సదస్సులో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించనున్నారు.

రీసెర్చ్ స్కాలర్స్ హాస్టల్ జేడీగా సాంబశివరావు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివేకానంద రీసెర్చ్‌స్కాలర్స్ హాస్టల్ జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ అంకశాల సాంబశివరావు నియమితులయ్యారు. ఈమేరకు శనివారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను సాంబశివరావు అందుకున్నారు.

ఎంజీఎంలో కార్మికుల ఆందోళన


ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో ఆందోళన చేస్తున్న కార్మికులు

ఎంజీఎం: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎంజీఎంలో కార్మికులు ఆందోళనకు దిగారు. ఆస్పత్రిలో సెక్యూరిటీ కాంట్రాక్ట్ టెండర్ దక్కించుకున్న సంస్థకు బిల్లులు నాలుగు నెలలుగా రావడంలేదని.. ప్రస్తుతం ఆ సంస్థ తమకు వేతనాలు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందని కార్మికులు వాపోయారు. వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మిక సంఘాల నాయకులు వరంగల్ కలెక్టర్ సత్యశారదను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన ఆమె.. నాలుగు రోజుల్లో కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించి విధుల్లో చేరారు.

కేవీకేను సందర్శించిన నాబార్డు జీఎం రమేశ్‌బాబు



చేపలపెంపకం యూనిట్‌ను పరిశీలిస్తున్న రమేశ్‌బాబు

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని శనివారం నాబార్డు జనరల్ మేనేజర్ రమేశ్ బాబు సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రం కోఆర్డినేటర్ రాజన్న, శాస్త్రవేత్త సీహెచ్ సౌమ్యతో కలిసి వ్యవసాయ యంత్రాలు, సింగారంలో ఏర్పాటు చేసిన బయోప్లాక్, చేపల పంపకం యూనిట్‌ను పరిశీలించారు. అనంతరం వ్యవసాయ సహకార సంఘాల్లోని రైతులకు వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఉపయోగపడే వ్యాపారాల గురించి చర్చించారు. యూనిట్ స్థాపించడానికి అయ్యే ఖర్చులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాబార్డు అధికారులు కామేశ్వర్ రావు, ఆర్యన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆశపడి.. మోసపోయాడు

- రూ.9.51 లక్షలు పోగొట్టుకున్న యువకుడు

కమలాపూర్ : టెలిగ్రామ్ యాప్‌లో వచ్చిన టాస్కులు ఆడితే జమ చేసిన మొత్తానికి రెట్టింపు నగదు వస్తుందని ఆశపెట్టారు.. ఓ యువకుడు నమ్మి రూ.9.51 లక్షలు పోగొట్టుకొని మోసపోయాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్ మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన వట్టేముల మనోజ్ గత నెల 6న టెలిగ్రామ్ యాప్ ద్వారా భావి జోషి అనే అడ్రస్ నుంచి ఇందులో డబ్బులు జమ చేసి తాము చెప్పిన టాస్కులు ఆడితే జమ చేసిన డబ్బులకు రెట్టింపు నగదు వస్తాయని మెసేజ్ వచ్చింది. దీనిని నమ్మిన మనోజ్ విడతల వారీగా మొత్తం రూ.9.51 లక్షలు డిపాజిట్ చేసి వారు నిర్దేశించిన టాస్కులు ఆడాడు. ఎంతకూ తనకు రావాల్సిన రెట్టింపు నగదు రాకపోవడంతో మోసపోయానని గ్రహించాడు. వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. శనివారం కమలాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు.

స్పోర్ట్స్ విలేజ్‌కు విద్యార్థుల ఎంపిక

కేయూ క్యాంపస్: క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా కాకతీయ యూనివర్సిటీలోని వ్యాయామ కళాశాలకు చెందిన 8 మంది బీపీఈడీ విద్యార్థులు బెంగళూరులోని స్పోర్ట్స్ విలేజ్‌కు ఎంపికయ్యారు. ఈక్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 20 మంది బీపీఈడీ విద్యార్థులు రాత, మౌఖిక పరీక్షలకు హాజరయ్యారు. అందులో 8 మంది ఎంపికైనట్లు శనివారం ఆ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్ తెలిపారు. వీరు నాలుగో సెమిస్టర్ పూర్తి చేసిన అనంతరం బెంగళూరు స్పోర్ట్స్ విలేజ్‌లో విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది. వీరికి వార్షిక వేతనం రూ.3 లక్షలు ప్రారంభ వేతనం ఉంటుందని ఆయన తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్‌తోపాటు స్పోర్ట్స్ విలేజ్ బాధ్యులు నాగబాబు, శ్వేత అభినందించారు.

హ్యాండ్ ప్రింట్ .. ఇదే నా బ్రాండ్



నిట్ వరంగల్ వాల్యూ ఎడ్యుకేషన్ అండ్ ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు హ్యాండ్ ప్రింటింగ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇదే నా బ్రాండ్ అంటూ పుష్ప సినిమా డైలాగ్‌తో అర చేతిని వివిధ రకాల రంగుల్లో ముంచి ముద్ర వేశారు. విద్యార్థులు పరస్పరం తమ హ్యాండ్ ప్రింట్‌ను 'టి' షర్ట్‌పై ఏర్పాటు చేసుకుని జ్ఞాపకంగా అందజేసుకున్నారు.

మట్టి పట్టు .. కుండ చేత పట్టు



స్ప్రింగ్ స్ప్రీ-25 వేడుకల్లో భాగంగా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో భాగంగా ధర్మసాగర్ మండలం ఉనికిచర్లకు చెందిన సారయ్య సారథ్యంలో విద్యార్థులు పాట్ మేకింగ్‌ను ఉత్సాహంగా చేపట్టారు. కుమ్మరులు తమ కులవృత్తిని నేటి తరానికి అందజేసేందుకు మట్టిని పట్టు.. కుండలను తయారు చేసి చేత పట్టు అంటూ ఉత్సాహంగా కుండలు తయారు చేశారు.

నువ్వా..? నేనా.. స్నేక్స్ అండ్ ల్యాడర్స్



నిట్ యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో స్ప్రింగ్‌స్ప్రీ-25లో భాగంగా చిన్నప్పుడు ఆడుకునే స్నేక్స్ అండ్ ల్యాడర్స్‌ను ఏర్పాటు చేశారు. కైలాసంలో నువ్వా? నేనా పాముకు నువ్వు బలి.. నిచ్చెనతో నేను గెలిచి అంటూ విద్యార్థులు పిల్లల స్నేక్స్ అండ్ ల్యాడర్స్ ఆటలో పాల్గొన్నారు.

కలర్‌ఫుల్.. ఫెస్ట్



అద్వితీయంగా 'నిట్' వసంతోత్సవం

- ఉత్సాహంగా పోటీ పడిన విద్యార్థులు
- గీతామాధురి, మ్యాడ్-2 సినిమా టీమ్ రాకతో ఫ్రోషో అదుర్స్
- కొరియో నైట్‌లో స్టెప్పులేసిన విద్యార్థులు
- నేటితో ముగియనున్న స్ప్రింగ్ స్ప్రీ-25 వేడుకలు

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లో మూడు రోజుల వసంతోత్సవ వేడుకలు స్ప్రింగ్‌స్ప్రీ-25 రెండో రోజు శనివారం కలర్‌ఫుల్‌గా సాగాయి. దేశవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి హాజరైన పదివేల మంది విద్యార్థులు తమ ప్రాంత సంస్కృతీసంప్రదాయాలను పరస్పరం పంచుకుంటూ ఆకట్టుకున్నారు. రెండో రోజు కలర్ పెయింటింగ్స్, ఆర్ట్స్, హ్యాండ్ ప్రింటింగ్, పాట్ మేకింగ్, స్నేక్స్ అండ్ ల్యాడర్స్, మేజ్ రన్, స్ట్రీట్ ఫొటోగ్రఫీ, పోలరాయిడ్ ఫొటోగ్రఫీ, ఆర్ట్ థెరపీ, తానాబానా, ట్రెజర్ హంట్, తదితర విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పోటీపడ్డారు.

నేటితో ముగియనున్న స్ప్రింగ్ స్ప్రీ-25..

నిట్‌లో విద్యార్థులే నిర్వాహకులుగా నిర్వహిస్తున్న మూడు రోజుల స్ప్రింగ్‌స్ప్రీ-25వేడుకలు ఆదివారం మూడో రోజుతో ముగియనున్నాయి. చివరి రోజు అల్యూర్‌లో భాగంగా ఫ్యాషన్ షో, డీజే నైట్, నుక్కడ్ నాటక్, బైక్ స్టంట్స్‌తో బైబై నిట్ అంటూ విద్యార్థులు స్ప్రింగ్ స్ప్రీ-25కు వీడ్కోలు పలుకుతారు.



పాడుతున్న సింగర్ గీతామాధురి

ఉర్రూతలూగించిన గీతామాధురి

నిట్ వరంగల్‌లో నిర్వహిస్తున్న మూడు రోజుల వసంతోత్సవ వేడుకలు స్ప్రింగ్‌స్ప్రీ-25లో భాగంగా సింగర్ గీతామాధురి తన పాటలతో ఉర్రూతలూగించారు. మ్యాడ్-2 సినిమా టీమ్ రాకతో విద్యార్థులు కేకలు వేస్తూ ఉత్సాహంగా డ్యాన్స్‌లు వేశారు.

కళ్లకు గంతలు.. అయినా చేరుతా గమ్యం



కళ్లకు గంతలు కట్టినా మీరు చూపే మార్గంతో గమ్యాన్ని చేరుతానంటూ వసంతోత్సవ వేడుకల్లో ఏర్పాటు చేసిన మేజ్ రన్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. నిట్ యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేజ్ రన్ పోటీల్లో విద్యార్థులు పాల్గొని తమ మిత్రుడికి తామే కళ్లకు గంతలు కట్టి మార్గ నిర్దేశం చేసి గమ్యాన్ని చేర్పించి 'వీ ఆర్ ఫ్రెండ్స్' అంటూ ఎంజాయ్ చేశారు. నేను నా ఫ్రెండ్‌ను గుడ్డిగా నమ్ముతానని ఆనందం వ్యక్తం చేశారు.

నే శారీ కడితే...



సంస్కృతీ,సంప్రదాయాలను పరస్పరం విద్యార్థులు పంచుకునే వేదికగా నిలుస్తున్న స్ప్రింగ్‌స్ప్రీ-25 వేడుకల్లో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ ఆదర్శంగా భారతీయ ఆహార పద్ధతులు, వస్త్రధారణపై నేటి తరానికి అవగాహన కల్పించేందుకు విద్యార్థులు శారీ కట్టుకుని విద్యార్థినులకు దీటుగా ముస్తాబయ్యారు. నేను శారీ కడితే ఎలా ఉంది అంటు వయ్యారంగా వాకింగ్ చేస్తూ అలరించారు.

యుద్ధానికి నువ్వు రెడీనా? ట్రెజర్ హంట్



అచ్చం యుద్ధంలో పాల్గొనే మిలిటరీని తలపిస్తూ విద్యార్థులు యుద్ధానికి నువ్వు రెడీనా? నేను రెడీ అంటూ శత్రువులపై తలపడేందుకు పోటీ పడ్డారు. నిట్ లిటరరీ అండ్ డిబేట్‌క్లబ్ సారథ్యంలో ఏర్పాటు చేసిన ట్రెజర్ హంట్‌లో విద్యార్థులు సైనికుల మాదిరి వస్త్రధారణతో ఆకట్టుకున్నారు.

21న 'భారత్ గౌరవ్' యాత్ర

- జనగామ, కాజీపేట, వరంగల్ మీదుగా స్పెషల్ టూరిస్ట్ రైలు



మాట్లాడుతున్న కిశోర్ సత్య

కాజీపేట రూరల్ /జనగామ: దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు దక్షిణ మధ్య రైల్వే ఈనెల 21న సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు 'భారత్ గౌరవ్' స్పెషల్ టూ రిస్ట్ రైలు యాత్ర(జ్యోతిర్లింగాల దర్శనం) ప్రారంభం కాబోతుందని ఐఆర్‌సీటీసీ టూరిజం మానిటర్ కొక్కుల ప్రశాంత్, సౌత్ సెంట్రల్ జోన్ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ కిశోర్ సత్య తెలిపారు. ఈ మేరకు శనివారం వారు కాజీపేట జంక్షన్, జనగామలో మాట్లాడుతూ పుణ్యక్షేత్రాలు అరుణాచలం, రామేశ్వరం, మధురై, శ్రీరంగం, కన్యాకుమారి, తిరుచ్చి, త్రివేండ్రం (అనంత పద్మనాభ స్వామి), తంజావూర్ తదితర క్షేత్రాలను సందర్శిస్తారన్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభమై భువనగిరి, జనగామ, కాజీపేట వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా ప్రయాణం సాగుతుందని తెలిపారు. ఇందులో స్లీపర్, థర్డ్, సెకండ్ ఏసీలో ప్రయాణం చేసేందుకు వెసలుబాటు కల్పించామన్నారు. ఎనిమిది రాత్రులు, తొమ్మిది రోజుల పర్యటన కోసం టికెట్ ధర రూ.14,250తో ప్రారంభమవుతుందన్నారు. ఇందులో పిల్లలకు స్లీపర్ కోచ్ రూ.14,250, థర్డ్ ఏసీ రూ.21,880, సెకండ్ ఏసీ రూ.28,440 ధర నిర్ణయించామన్నారు. ఈ యాత్రలో రోజుకు మూడుసార్లు భోజన వసతితో పాటు ప్రతి కోచ్‌లో భక్తుల సేవాకార్యం గురించి ఐఆర్ సీటీసీ సిబ్బంది అందుబాటులో ఉంటారు. దక్షిణ మధ్య రైల్వేశాఖ చేపట్టిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం వెబ్‌సైట్ irctctourism.com లేదా 9281030749, 9989676794, 9701360701, 92810307 11/12 నంబర్లను సంప్రదించగలరని వారు తెలిపారు.

డాక్టర్ సుమంత్‌రెడ్డి మృతి

- ఎంజీఎంలో చికిత్స పొందుతూ కన్నుమూత
- కన్నీటి వీడ్కోలు పలికిన కుటుంబికులు, బంధువులు, స్థానికులు



డాక్టర్ సుమంత్‌రెడ్డి (ఫైల్)

ఖిలా వరంగల్/కాజీపేట: డాక్టర్ గాదె సుమంత్ రెడ్డిపై హత్యాయత్నం కేసు వరంగల్‌లో సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో ప్రాణాపాయస్థితికి చేరుకున్న సుమంత్‌రెడ్డి.. సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో మెరుగైన చికిత్స పొందినప్పటికీ 8 రోజులుగా మృత్యువుతో పోరాడి చివరికి ఓడిపోయాడు. యశోద నుంచి సుమంత్ రెడ్డిని శుక్రవారం ఉదయం వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు అర్ధరాత్రి మృతి చెందాడు. సుమంత్ రెడ్డి మృతదేహానికి శనివారం పోస్టుమార్టం పూర్తి చేసి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారు ప్రజల సందర్శనార్థం కాజీపేట సిద్ధార్థనగర్‌లోని తమ ఇంటితోపాటు కాజీపేటలోని క్లినిక్‌కు తరలించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతదేహాన్ని సంగారెడ్డికి తరలించారు. కాగా, వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కారణంగా తన భర్త అడ్డు తొలగించుకోవాలని భార్య ఫ్లోరా ప్లాన్ మేరకు గత నెల 20వ తేదీన రాత్రి 10.30 గంటలకు ప్రియుడు శామ్యూల్, ఏఆర్ కానిస్టేబుల్ రాజ్‌కుమార్.. వైద్యుడు సుమంత్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన విషయ విధితమే.

నిందితులపై హత్య కేసు నమోదు

సుమంత్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురు నిందితులపై తొలుత హత్యాయత్నం కేసు నమోదైంది. అయితే సుమంత్ రెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందగా.. ముగ్గురు నిందితులపై శనివారం హత్యకేసుగా మార్పు చేసినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ-సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంపీటీ)లో నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నం జరిగింది. గీసుకొండ సీఐ మహేందర్ కథనం ప్రకారం.. కేఎంటీపీలోని గణేశా ఎకోపెట్ కంపెనీలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన దంపతులు పని చేస్తున్నారు. అలాగే, నేపాల్‌కు చెందిన రాజు అనే వ్యక్తి కూడా అదే కంపెనీలో పని చేస్తున్నాడు. వారు కంపెనీలో కార్మికుల కోసం కేటాయించిన గదుల్లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం సాయంత్రం ఉత్తర్‌ప్రదేశ్ దంపతుల్లో భర్త కంపెనీలో పనికి వెళ్లగా అతడి భార్య, నాలుగేళ్ల కూతురు ఇంటి వద్ద ఉన్నారు. వారికి సమీపంలో ఉన్న రాజు ఆ బాలికకు కూల్ డ్రింక్ ఇస్తానంటూ మాయమాటలు చెప్పి తన గదికి తీసుకెళ్లాడు. లైంగికదాడికి యత్నించగా ఆ బాలిక ఏడవడంతో తల్లి, సమీపంలోని వారు అక్కడికి చేరుకున్నారు. దీంతో రాజు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

టీజీ ఎన్పీడీసీఎల్‌కు పీఎస్‌యూ లీడర్ షిప్ అవార్డు



సీఎండీ వరుణ్ రెడ్డికి అవార్డు అందజేస్తున్న ఇన్‌చార్జ్ డైరెక్టర్లు, కంపెనీ సెక్రటరీ

హన్మకొండ : తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ మండలి పీఎస్‌యూ లీడర్ షిప్ అవార్డు అండ్ ఇన్నోవేషన్ ఇన్ ఆపరేషనల్ ఎక్సలెన్స్ అవార్డు అందుకుంది. శుక్రవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం, అసిస్టెంట్ సెక్రటరీ ఎం.వి.రమణారెడ్డి అందుకున్నారు. ఈ అవార్డును శనివారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులందరికీ వినూత్న సేవలు అందించడంతో పాటు సాంకేతికతను అందిపుచ్చుకుంటూ మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సేవలు అందిస్తున్నందుకు ఈ అవార్డు దక్కిందన్నారు. ఎన్పీడీసీఎల్‌లో తీసుకొచ్చిన నూతన విధానాలు అమలుతో వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.ఈ అవార్డును స్ఫూర్తిగా తీసుకుని అధికారులు, ఉద్యోగులు రెట్టించిన ఉత్సాహంతో పని చేద్దామని పిలుపునిచ్చారు. ఇన్‌చార్జ్‌లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి.ఈలు కె.తిరుమల్ రావు, బీకం సింగ్, రాజు చౌహాన్, రవీంద్రనాథ్, వెంకటరమణ, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం, జాయింట్ సెక్రటరీ రమేశ్ , డీ.ఈ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

బయో మిథనైజేషన్ ప్లాంట్ తనిఖీ

వరంగల్ అర్బన్: బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో ఇటీవల పునరుద్ధరించిన బయో మిథనైజేషన్ ప్లాంట్‌ను కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తనిఖీ చేశారు. ప్లాంట్ నిర్వహణ తీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ సామర్థ్యం ఎంత? ప్రతీ రోజు గ్యాస్ ఉత్పత్తికి ఎంత తడి చెత్త వినియోగిస్తున్నారు? గ్యాస్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి ఎలా చేస్తారు? తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్, ఎలక్ట్రికల్ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్లాంట్ నిర్వహణ నిరంతరం కొనసాగేలా చూడాలని చెప్పారు. ఈ తనిఖీల్లో ఎంహెచ్‌ఓ రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్, ఏఈ సంతోశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కొనసాగింపు



ప్రిన్సిపాల్ జ్యోతికి నియామక ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్‌గా కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ ఎస్.జ్యోతిని కొనసాగిస్తూ శనివారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. జ్యోతి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టి గత నెల 28తో ఏడాది గడిచింది. మరో ఏడాది పాటు పదవీకాలం కొనసాగిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులను ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతికి అందజేశారు.

వైస్ ప్రిన్సిపాల్ ఎవరు?

యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సోషియాలజీ విభాగం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పుల్లా రమేశ్ పదవీకాలం గత నెల 28న ముగిసింది. అయితే వైస్ ప్రిన్సిపాల్‌గా తమను నియమించాలని ఆకళాశాలకు చెందిన నలుగురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు వీసీని అడిగినట్లు సమాచారం. వైస్ ప్రిన్సిపాల్ పదవి కోసం పోటీ నెలకొనడంతో ఎవరిని నియమించాలో యూనివర్సిటీ అధికారులు తేల్చుకోలేకపోతున్నారు. ఆకళాశాలలో ఒక్కరే రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉన్నారు. ఆమెకు అవకాశం ఇస్తారా.. లేదా?? అనేది వేచి చూడాలి. లేకపోతే పుల్లా రమేశ్‌నే కొనసాగిస్తారా? లేక ఆపదవిని ఆశిస్తున్న నలుగురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లలో ఎవర్నైనా నియమిస్తారా? అనేది వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది.

సృజనాత్మకతను వెలికితీసేందుకే పోటీలు



మాట్లాడుతున్న బాలు

హసన్‌పర్తి: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకే ఐడియాథాన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టాస్క్ ప్రాజెక్ట్ మేనేజర్ బాలు అన్నారు. అన్నాసాగరం శివారు సుమతీరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాల టాస్క్ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ ఫర్ తెలంగాణ ఐడియా థాన్ పోటీలు ముగిశాయి. ఫిబ్రవరిలో తొలి దశ పోటీలు నిర్వహించగా.. తుది దశ పోటీలు శనివారం జరిగాయి. ఈకార్యక్రమానికి టాస్క్ ప్రాజెక్ట్ మేనేజర్ బాలు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలను స్టార్టప్‌గా ఎలా మలుచుకోవాలో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు ప్రశాంత్, ఝాన్సీరాణి, సుదర్శన్, మహేందర్, వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

దారికాచిన మృత్యువు..

- సైకిల్‌ను ఢీకొన్న హైడ్రాలిక్ వాహనం
- తండ్రి, తనయుడి దుర్మరణం
- కోతులనడుమలో ఘటన





రాజేశ్వర్‌రావు(ఫైల్) వికాస్‌రావు (ఫైల్)

ఎల్కతుర్తి : సైకిల్‌పై బంధువుల ఇంటికి వెళ్తున్న తండ్రి, కుమారుడిని మృత్యువు కబలించింది. హైడ్రాలిక్ క్రేన్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిపై శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు, ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం కోతులనడుమ గ్రామానికి చెందిన తంగెడ రాజేశ్వర్‌రావు (65) తన కుమారుడు వికాస్‌రావు (21)తో కలిసి సైకిల్‌పై వల్బాపూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో హుజూరాబాద్ నుంచి ఎల్కతుర్తి వైపునకు వెళ్తున్న హైడ్రాలిక్ క్రేన్ వాహనం అతివేగంగా వచ్చి ఢీకొనడంతో తండ్రి, కొడుకుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. తండ్రి, కుమారుడి మృతితో ఆ కుటుంబంతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఐకమత్యంగా ఉంటేనే ప్రయోజనం

- అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి



మాట్లాడుతున్న కందకట్ల స్వామి

వరంగల్ చౌరస్తా : పద్మశాలీ కులస్తులంతా ఐకమత్యంగా ఉంటేనే కులానికి ప్రయోజనం చేకూరుతుందని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, నగర మేయర్ సుధారాణి అన్నారు. ఈనెల 9న హైదరాబాద్ నాంపల్లి జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించే 17వ అఖిల భారత పద్మశాలి సంఘం, 8వ తెలంగాణ ప్రాంతీయ మహా సభ నేపథ్యంలో శనివారం వరంగల్ చార్‌బౌళిలోని పద్మాశాలీ ఫంక్షన్ హాల్‌లో సంఘం వరంగల్, హన్మకొండ జిల్లాల అధ్యక్షులు లయన్ ఆడేపు రవీందర్, బచ్చు ఆనంద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహా సభ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కుల బలం చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం మేయర్ గుండు సుధారాణి, ప్రభాకర్‌రావు దంపతులను సత్కరించారు. సమావేశంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, ప్రధాన కార్యదర్శి రాంచందర్‌రావు, నాయకులు వద్నాల నరేందర్, గుండేటి నరేందర్, ఈగ వెంకటేశ్వర్లు, వైద్యం రాజగోపాల్, తవుటం రవీందర్, పోరాండ్ల కృష్ణ ప్రసాద్, కందికట్ల ప్రశాంత్, కేదాశి వెంకటేశ్వర్లు, గడ్డం భాస్కర్, డీఎస్.మూర్తి, కుసుమ సతీష్, వంగ సూర్యనారాయణ, గడ్డం కేశవమూర్తి, పులికంటి రాజేందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయ హుండీ ఆదాయం రూ.66 లక్షలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయంలో శనివారం హుండీ లెక్కించారు. 84రోజులకు గాను రూ.66,00,196 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ శేషభారతి తెలిపారు. దీంతో పాటు 186 యూఎస్ డాలర్లు, 200 సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఓమన్ బైసా, 10 బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ పౌండ్స్, 1/2 సెంట్రల్‌బ్యాంక్ ఆఫ్ బెహరాన్ దినార్, 11 మలేషియా రెంగెట్స్, 15 యూరోలు, 10 యుఏఈ దిరమ్స్, ఒక సౌదీ అరేబియా రియాల్స్, ఒక ఖతర్ సెంట్రల్ బ్యాంక్ దినార్, 2 సింగపూర్ డాలర్లు, 2000 టాంజానియా కరెన్సీ లభించినట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర విజిలెన్స్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.